# జయశంకర్ సార్‌కు నివాళి







**రాజ్‌భవన్‌లో..**

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తన అధికారిక నివాసమైన రాజ్‌భవన్‌లో ప్రొ. జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

**సాహిత్య అకాడమీలో..**

రవీంద్రభారతి, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో టూరిజం శాఖ ముఖ్య కార్యదర్శి ఏ.వాణిప్రసాద్ పాల్గొని జయశంకర్ సార్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. చిత్రంలో మామిడి హరికృష్ణ, తదితరులున్నారు.

తెలంగాణ రాష్ట్ర సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా డీజీపీ కార్యాలయంలో మంగళవారం ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో డీజీపీ జితేందర్, ఏడీజీలు అభిలాష్ బిస్త్, సంజయ్ కుమార్ జైన్, స్టీఫెన్ రవీంద్ర, ఐజీలు సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, సైబరాబాద్ సీపీ అవినాశ్ మొహంతి పాల్గొన్నారు.



**కలెక్టరేట్‌లో..**

తెలంగాణ తొలి దశ ఉద్యమానికి ఊపిరి, మలి దశ ఉద్యమానికి దిక్సూచిగా ఆచార్య జయశంకర్ సార్ నిలిచారని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో ప్రొ.జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరవన్, ఏఓ సదానందం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**జీహెచ్ఎంసీలో..**

ఆచార్య జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని, అదే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇంకా పలువురు అధికారులు పాల్గొన్నారు.



**జలమండలిలో..**

జయశంకర్ సార్ జయంతిని ఖైరతాబాద్ జల మండలి ప్రధాన కార్యాలయంలో ఘనంగా జరిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈఎస్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు హాజరై జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవల్ని కొనియాడారు.

## క్యాబ్ డ్రైవర్ల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్

ఖైరతాబాద్, ఆగస్టు 6: క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్ల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని తెలంగాణ ట్యాక్సీ డ్రైవర్స్ జేఏసీ కోశాధికారి కిరణ్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండేండ్ల క్రితం వెంకటేష్ గౌడ్ అనే ట్యాక్సీ డ్రైవర్‌పై రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో కొందరు ప్రయాణికులు దాడి చేయడంతో రెండేండ్ల పాటు కోమాలో ఉండగా, కుటుంబ సభ్యులు పొలాలు, ఇండ్లు అమ్ముకొని సుమారు రూ.1.40 కోట్లపైగా చికిత్స కోసం వెచ్చించినా ఫలితం లేకపోవడంతో ఇటీవల మృతి చెందాడన్నారు. ఎస్సై పరీక్షలకు సమాయత్తమవుతూ పార్ట్ టైం ట్యాక్సీని నడిపేవాడని, ఆయన మృతితో కుటుంబ సభ్యులు ఆర్థికంగా చితికిపోయారన్నారు. ఇటీవల రాంనగర్‌లో మరో క్యాబ్ డ్రైవర్‌పై దాడి చేయగా, చికిత్స పొందుతున్నాడని, ఇటీవల కాలంలో ఈ దాడులు పెరిగాయన్నారు. యాప్ బేస్డ్ కంపెనీలు తమను దోచుకుంటున్నాయని, వారికి కమిషన్లు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆన్ డ్యూటీలో చనిపోతే ఐదు లక్షల నుంచి పది లక్షలు రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కానీ, ఇప్పటి వరకు రూపాయి చెల్లించలేదన్నారు. అంతే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మహాలక్ష్మి పథకం వల్ల తమకు తీవ్ర నష్టం జరిగిందని, తమకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని, మీటర్ రీడింగ్ విధానం తీసుకువస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. అలాగే, ప్రభుత్వం ప్రతి క్యాబ్, ట్యాక్సీలకు డ్యాష్ క్యామ్ (కెమెరా) విధానం తీసుకురావాలని, తద్వారా అటు మహిళా ప్రయాణికులకు, ఇటు డ్రైవర్లు సురక్షితంగా ప్రయాణించవచ్చని, యాప్ బేస్డ్ కంపెనీలపై చట్టం చేసి వారి వద్ద డేటా కలెక్ట్ చేయాలన్నారు. బయట రాష్ట్రాలకు చెందిన వాహనాలు యథేచ్ఛగా గ్రేటర్‌లో తిరుగుతూ తమ కడుపులు కొడుతున్నాయని, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తగిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. జేఏసీ నాయకులు సంతోష్ గుప్తా, రవూఫ్, నంద సురేశ్ పాల్గొన్నారు.

## వక్ఫ్ భూముల పరిరక్షణకు చర్యలు

సిటీబ్యూరో, ఆగస్టు 6(నమస్తే తెలంగాణ): జిల్లాలో వక్ఫ్ భూములు, ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం వక్ఫ్ భూములపై ఆయన సమీక్ష నిర్వహించారు. వక్ఫ్ భూముల వివరాలను ప్రొహిబిటెడ్ ఆర్డర్ బుక్ (పీఓబీ) రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. మండలాలు, డివిజనల్ వారీగా వివరాలు సేకరించాలని కోరారు. ఆక్రమణలు ఉంటే వెంటనే తొలిగించాలన్నారు. కాగా, జిల్లాలో 1785 ఎకరాల వక్ఫ్ భూములు ఉన్నాయని వక్ఫ్ బోర్డు అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మహిపాల్, దశరథ్ సింగ్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియాస్ అహ్మద్, జీహెచ్ఎంసీ సిటీ ప్లానర్ శ్యామ్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఏడీవీ. శ్రీరామ్ పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి

- ప్రజాపాలనలో పోలీసులే రాజ్యమేలుతున్నారు
- దళిత మహిళ పై పోలీసుల దాష్టీకం దుర్మార్గానికి పరాకాష్ట
- ప్రగతిశీల మహిళా సంఘం ఐపీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి పెర్క సునీత



దళిత మహిళపై పోలీసులు దాడికి నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

జవహర్‌నగర్, ఆగస్టు 6: ప్రజాపాలనలో పోలీసులే రాజ్యమేలుతున్నారని, దళిత మహిళపై పోలీసుల దాష్టీకం దుర్మార్గానికి పరాకాష్ట అని, తెలంగాణలో శాంతిభద్రతలు గాడితప్పాయని, ప్రభుత్వం మొద్దునిద్రను విడనాడి దళిత మహిళకు న్యాయం చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం ఐపీవోడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పెర్క సునీతా డిమాండ్ చేశారు. దొంగతనం కేసులో విచారించాలని షాద్‌నగర్ పోలీసులు దళిత మహిళపై దాడి చేయడానికి నిరసిస్తూ జవహర్‌నగర్ కార్పొరేషన్ గబ్బిలాలపేటలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ, టెక్నాలజీతో సమాజం కొత్తపుంతలు తొక్కుతుంటే దళిత మహిళను బట్టలు విప్పి డీఐతో పాటు మగ కానిస్టేబుళ్లు చెప్పుకోలేని చోట కొట్టడం ఏంటి? అని ప్రశ్నించారు. దళిత మహిళపై జరిగిన దాడి యావత్ తెలంగాణ ఆడబిడ్డలపై జరిగినట్టేనని, ప్రభుత్వం పూర్తిగా నైతిక బాధ్యత వహించి మహిళా కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. మహిళపై దాడికి కారణమైన ఫిర్యాదుదారుడు నాగేందర్‌పై చట్టపరమైన చర్యలను తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్ షావలి, చైతన్య మహిళా సంఘం అల్లూరి సావిత్రి, సూదగాని వెంకటేష్, అంజయ్య, లలిత, కళావతి, నిర్మల, అరుణ, యాదగిరి, స్వామి, రాజు, ప్రశాంత్, విజయ్, కుమార్ పాల్గొన్నారు.

## గవర్నర్ జోక్యం చేసుకోవాలి

- రాష్ట్రంలో మహిళలు, చిన్నారులకు రక్షణ లేదు
- నేరాలు పెరుగుతున్నా సర్కారుకు పట్టింపు లేదు
- గవర్నర్ జిష్ణుదేవ్‌కు బీజేపీ మహిళా మోర్చా లేఖ

హైదరాబాద్, ఆగస్టు 5(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మహిళలు, చిన్నారులకు రక్షణ కరువైందని, ప్రభుత్వం, పోలీసు శాఖ నిర్లక్ష్యం వహిస్తున్నాయని బీజేపీ మహిళా మోర్చా విమర్శించింది. ఇలాంటి వాటిపై వెంటనే జోక్యం చేసుకోవాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి మంగళవారం లేఖ రాశారు. ఎన్సీఆర్బీ రికార్డుల ప్రకారం, గతేడాది 12 శాతం నేరాలు పెరిగాయని, ఈ దఫా మహిళలు, చిన్నారులపై అంతకన్నా ఎక్కువే నేరాలు జరుగుతున్నా కేసుల నమోదు, దర్యాప్తులో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తున్నదని పేర్కొన్నారు. మహిళా మోర్చా, ఇతర మహిళా సంఘాలు ఆందోళన చేస్తే తప్ప కేసులు నమోదు చేయని ఘటనలు ఎన్నో ఉన్నాయని, ఇందుకు చెంగిచర్ల, పెద్దపల్లి, మేడ్చల్ ఘటనలే ఉదాహరణ అని తెలిపారు. గవర్నర్ వెంటనే జోక్యం చేసుకొని రాష్ట్రంలో నేరాలపై నివేదిక తెప్పించుకొని సమీక్షించాలని విజ్ఞప్తి చేశారు.

## స్వచ్ఛదనం-పచ్చదనంలో 58 జీవీపీల తొలగింపు!

- జీహెచ్ఎంసీ అధికారులు

సిటీబ్యూరో, ఆగస్టు 6(నమస్తే తెలంగాణ): స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 58 జీవీపీలను తొలగించినట్లు జీహెచ్ఎంసీ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1,147 జీవీపీలలో చెత్త తొలగించాలని, వీక్లీ మార్కెట్లలో 96 కమిటీలను ఏర్పాటు చేశారు. 257 కమ్యూనిటీలలో 275 ఎడ్యూకేషనల్ ఇనిస్టిట్యూట్, 96 గ్రేవీయార్డులు, 49 రైల్వే ప్లాట్ ట్రాక్ చుట్టు పక్కల క్లియర్ చేశారు. 654 కాలనీలలోని లక్ష 24వేల 570 ఇళ్లల్లో ఫాగింగ్ కార్యక్రమాలు, 15 చెరువులు నీటి వనరులలో దోమల నివారణకు చర్యలు తీసుకున్నారు. 1,098 వీధి కుక్కలకు స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ వేసినట్లు, 758 స్టెరిలైజేషన్ చేయని కుక్కలను గుర్తించినట్లు చెప్పారు. 234 ఫీడింగ్ ఏరియాలను గుర్తించినట్లు తెలిపారు. దోమల నివారణకు ఆయిల్ బాల్స్, గంబూసియా చేపలను విడుదల చేశారు. 38.564 కిలోమీటర్ల మేర నాలాలో డీ-సిల్టింగ్, 402 పాట్‌హోల్స్ పూడ్చినట్లు అధికారులు తెలిపారు.

# ప్రాణాంతక సమస్యలపై ప్రత్యేక దృష్టి

- సికిల్ సెల్ ఎనీమియాను గుర్తించేలా పరీక్షలు
- నాగ్‌పూర్ ఎయిమ్స్‌లో వినియోగించనున్న సీసీఎంబీ పీసీఆర్ టెస్ట్
- గర్భస్థ శిశువులో ఉండే జన్యు లోపాలను ముందే గుర్తించేందుకు అవకాశం
- వైద్య పరీక్షల్లో సాయపడనున్న సీసీఎంబీ టెక్నాలజీ



నాగ్‌పూర్ ఎయిమ్స్ బృందంతో సీసీఎంబీ పరిశోధకుడు డా. చందక్

సిటీబ్యూరో, ఆగస్టు 6(నమస్తే తెలంగాణ): ప్రాణాంతకమైన జన్యులోప సమస్యలను ముందుగానే గుర్తించేలా సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే నేషనల్ ఆలయన్స్ ఆఫ్ సికిల్ సెల్ ఆర్గనైజేషన్‌కు సీసీఎంబీ అడ్వైజరీగా వ్యవహరిస్తుండగా.., కొంత కాలంగా ఈ వ్యాధి నియంత్రణకు అవసరమైన పరిశోధనలు డా. జీఆర్ చందాక్ బృందం చేస్తోంది. ఈ క్రమంలో సీసీఎంబీ డెవలప్ చేసిన ఆధునాతన డయాగ్నోసిస్ విధానాలను వినియోగంలోకి తీసుకువస్తున్నారు. చందాక్ లేబోరేటరీ రూపొందించిన పీసీఆర్ టెస్టింగ్ విధానాన్ని నాగ్‌పూర్ ఎయిమ్స్‌లో వాడనున్నారు. ఈ విధానం ద్వారా సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ వేగంగా చేసుకునే అవకాశం ఉంది. దీంతో వ్యాధి నియంత్రణకు సకాలంలో వైద్య చికిత్సలు అందించే వీలు ఉంటుందన్నారు. ప్రధానంగా గర్భస్థ శిశువులో ఉండే జన్యు లోపాలను గుర్తించే విధానాలను సీసీఎంబీ పరిశోధన బృందం అధ్యయనం చేస్తోంది. నేషనల్ సికిల్ సెల్ ఎనిమియా మిషన్ కార్యక్రమంలో భాగంగా వ్యాధి నిర్ధారణ కోసం జాతీయ స్థాయిలో 25కు పైగా పలు పరిశోధన సంస్థలు కృషి చేస్తున్నాయి. అందులో ప్రముఖ స్వచ్ఛంద, వైద్యారోగ్య సంస్థలతో సీసీఎంబీ ఒకటిగా ఉంది. అయితే, సీసీఎంబీ డెవలప్ చేసిన పీసీఆర్ టెస్ట్ ద్వారా వ్యాధి నిర్ధారణ సులభతరం అవుతుందంటున్నారు. ఈ క్రమంలోనే ఎయిమ్స్ – నాగ్‌పూర్‌తో కలిసి ఈ డయాగ్నోసిస్ సేవలను అందించనున్నట్లుగా సీసీఎంబీ వర్గాలు వెల్లడించాయి.

## ఎల్‌జీబీటీక్యూకు బాసటగా నిలువడం హర్షణీయం

- తొలి తీర్పునిచ్చిన తెలంగాణ హైకోర్టు

ఖైరతాబాద్, ఆగస్టు 6: ఎల్జీబీటీక్యూ సమాజానికి న్యాయస్థానం అండగా నిలుబడం హర్షణీయమని క్వీర్ నిలయం వ్యవస్థాపకుడు జయంత్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హైకోర్టు న్యాయవాది హేమా లలితతో కలిసి వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన యువతి, తెలంగాణ రాష్ట్రానికి చెందిన మరో యువతితో పరస్పర అంగీకారంతో సహజీవనం చేసే వారని తెలిపారు. అయితే, వారి బంధాన్ని ఇష్టపడని తెలంగాణ యువతి తల్లిదండ్రులు మిస్సింగ్ కేసుగా నమోదు చేయగా, పోలీసులు వారిని జైపూర్‌లో ఉన్నట్లు గర్తించారన్నారు. అనంతరం, జరిగిన పరిణామాల్లో ఆమెను బలవంతంగా తెలంగాణకు తీసుకుచ్చి వారి ఇంట్లో నిర్బంధించారన్నారు. దీంతో రాజస్థాన్‌కు చెందిన యువతి హైకోర్టును ఆశ్రయించగా, బాధితురాలి తరపున వివిధ అత్యున్నత న్యాయస్థానం తీర్పులను ఉదాహరించడంతో పాటు వారిద్దరూ మేజర్లు అయినందు వల్ల ఇద్దరు కలిసి జీవించవచ్చని తీర్పునిచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే మొదటిసారిగా ఇలాంటి తీర్పునివ్వడం ప్రశంసనీయమని, అత్యున్నత న్యాయస్థానం తీర్పును ఎల్జీబీటీక్యూ సమాజం స్వాగతిస్తుందన్నారు. ఈ సమావేశంలో క్వీర్ నిలయం ప్రతినిధులు నగీనా, దీప్తి తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది హేమా లలిత

## స్వచ్ఛదనం - పచ్చదనంను విజయవంతం చేద్దాం

- గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీని సందర్శించిన కలెక్టర్



గుండ్ల పోచంపల్లిలోని పల్లె ప్రకృతి వనంలో మొక్కలు నాటి నీరు పోస్తున్న కలెక్టర్ గౌతం

మేడ్చల్ రూరల్, ఆగస్టు 6: పరిసరాల స్వచ్ఛత కోసం చేపడుతున్న స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం అన్నారు. మేడ్చల్ జిల్లాలోని గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలో మంగళవారం కలెక్టర్ సందర్శించి స్వచ్ఛదనం – పచ్చ దనం కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, పల్లె ప్రకృతి వనంలో మొక్కలు నాటారు. అనంతరం, యాదాద్రి ప్లాంటేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పరిసరాలు పరిశుభ్రత అత్యంత అవసరమని, పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక అధికారి వినోద్, మున్సిపల్ కమిషనర్ స్వామి, వైస్ చైర్మన్ ప్రభాకర్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఆధ్యాత్మిక పర్యటన

ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మిత్ర బృందం అస్సాంలోని ప్రసిద్ధ కామాఖ్య ఆలయాన్ని మంగళవారం దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. – మేడ్చల్, ఆగస్టు 6(నమస్తే తెలంగాణ)

## ఫిష్ క్యాంటీన్ తరహాలో.. మాంసం క్యాంటీన్‌ను ప్రారంభించాలి



పశు సంవర్ధక శాఖ కార్యాలయాన్ని సందర్శించిన మత్స్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్

సుల్తాన్‌బజార్, ఆగస్టు 6: మత్స్య శాఖ క్యాంటీన్ తరహాలో మాంసం క్యాంటీన్‌ను తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ పశు సంవర్ధక పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం మాసబ్ ట్యాంక్ శాంతినగర్‌లోని తెలంగాణ పశు సంవర్ధక శాఖ, మత్స్య శాఖలను ఆయన మొట్టమొదటిసారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్‌లో తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీకి సంబంధించిన బ్రీడింగ్ కార్యకలాపాలు, కేంద్ర ప్రయోజక పథకాలను సమీక్షించారు. ఎఫ్ఎస్‌బీఎస్ కరీంనగర్, ఎఫ్ఎస్‌బీఎస్ కంసాన్‌పల్లికి చెందిన పనులను వెంటనే వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. గ్రామాలలో పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు, ఫెర్టిలిటీ క్యాంప్స్ ద్వారా ఉత్తమ జాతి దూడలను పెంపొందించాలన్నారు. పశు వైద్యులు పశు పోషకులకు సెక్స్ సోర్టెడ్ సెమెన్‌పై అవగాహన కల్పించి మేలు జాతి ఆడ దూడలను పెంపొందించేటట్టు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం, ఆయన మత్స్య శాఖ క్యాంటీన్‌ను సందర్శించారు. ఆ తరహాలోనే క్వాలిటీతో కూడిన మాంసం క్యాంటీన్‌ను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమీక్షలో తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్ మల్లీశ్వరి, గొర్రెలు, మేకల పెంపకదారుల సమైఖ్య అధికారి డాక్టర్ బీ సుబ్బరాయుడుతో పాటు జిల్లాల నుంచి డీఎల్‌డీఏ కార్య నిర్వాహణాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రహదారులకు మరమ్మతులు పూర్తి చేయాలి



వనస్థలిపురంలో రహదారులకు మరమ్మతులు చేయిస్తున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవి కుమార్

వనస్థలిపురం, ఆగస్టు 6: వర్షాలతో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టి వాటిని సకాలంలో పూర్తి చేయాలని బీఆర్ఎస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు చింతల రవి కుమార్ అన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదేశాలతో డివిజన్‌లోని పలు చోట్ల దెబ్బతిన్న రహదారులను సిబ్బందితో మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వారం రోజులు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పలు కాలనీల్లో ప్రధాన, అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయన్నారు. గుంతలమయంగా మారిన రహదారులపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోలీస్ స్టేషన్ నుంచి కాంప్లెక్స్ రోడ్డుకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించామన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు అంతర్గత రహదారులను కూడా గుర్తించి మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## ఈ. డీఎన్‌ఏపై బయోలాజిస్టులకు శిక్షణ



సిటీబ్యూరో, ఆగస్టు 6(నమస్తే తెలంగాణ): సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యూలర్ బయాలజీలో ఎన్విరాన్‌మెంటల్ డీఎన్ఏపై బయోలాజిస్ట్‌లకు ప్రత్యేక శిక్షణనిచ్చారు. పలు విభాగాలకు చెందిన బయాలజీ నిపుణులకు డీఎన్ఏ, ఈ–డీఎన్ఏ విశ్లేషణ తీరు తెన్నులపై సీసీఎంబీలో ఉన్న ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. వైల్డ్ లైఫ్ బయాలజిస్టులు సులభంగా నిర్వహించుకునే పరిశోధన విధానాలపై చర్చించారు.

ప్రధానంగా నీటి వనరుల నుంచి సేకరించిన డీఎన్ఏ నమూనాలను విశ్లేషించడం కోసం అందుబాటులో ఉన్న ఉపకరణాలను విశ్లేషించారు. ఈ డీఎన్ఏ విశ్లేషణకు అవసరమైన ఆధునాతన సాంకేతికత ద్వారా ఖచ్చితమైన ఫలితాలను పొందే వీలు ఉందన్నారు.

## ఇండియన్ బ్యాంక్ వాక్‌థాన్@కేబీఆర్ పార్కు




సిటీబ్యూరో, ఆగస్టు 6(నమస్తే తెలంగాణ): ఇండియన్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈ నెల 15న నిర్వహిస్తున్న నేపథ్యంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది, ఖాతాదారులతో కలిసి కేబీఆర్ పార్క్ వద్ద మంగళవారం వాక్‌థాన్ నిర్వహించారు. రిటైల్ డిపాజిట్ క్యాంపెయిన్ 118 పేరుతో ఈ వాక్‌థాన్ నిర్వహించారు. బ్యాంకును స్థాపించి 118 ఏండ్లు అవుతుండటంతో 118 పేరును పెట్టి ఎస్బీ, సీఏ, ఆర్‌టీడీకి సంబంధించి 118 ఖాతాలను జమ చేస్తున్నట్లు తెలిపారు. గత నెల 18 నుంచి ఈ నెల 13 వరకు స్పెషల్ ఫోకస్ పెట్టి కొత్త ఖాతాదారులను రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రావు, పీజీఎం రాజేశ్వరరెడ్డి, జోనల్ మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. వాక్‌థాన్ నిర్వహిస్తూ బ్యాంకుకు సంబంధించిన కరపత్రాలు ఖాతాదారులకు పంపిణీ చేశారు.